# చల్లని మంట

ఎమ్. ఎస్. రావ్

రాధ మరికాస్త అన్నం పెట్టబోయింది. రాజారావ్ విసుగ్గా అన్నాడు. 'ఉన్నదే [illegible] [illegible] ఇంకా ఎందుకులే'

అసలు సాయంకాలంనుంచీ మనస్సు చికాగ్గా ఉంది అతనికి. కంచం ముందు కూర్చున్నాడే కాని వట్టైదన్నంకూడా తినలేకపోయాడు. అప్పటికే రాధ ఒకటి రెండుసార్లు కొసరి కొసరి వడ్డించబోయింది. దానివల్ల చికాకు హెచ్చిందే కాని మనస్సు స్థిమిత పడలేదు.

మజ్జిగపోస్తూ 'మన ప్రక్కింటి వాళ్ళు ఈ ఊరు వదలి వెళ్తున్నారట. వాళ్ళమ్మాయి లక్ష్మి చెప్పింది. పాపం వాళ్ళకి ఇక్కడ గడవటమే కష్టంగా



ఉందిటండీ' అంది రాధ. పరధ్యాన్నం కొద్దిగా వదిలినట్లయింది రాజారావ్‌కి.

'ఏం! ఎందుకుట?'

'ఏం చేస్తారండీ! తిండికి గడవటమే కష్టమైతే. ఉదయమనగా వెళ్ళి నాయన చీకటిపడేవరకు రానేలేదుట. చూచి చూచి ఇంతకుముందే వచ్చి లక్ష్మి ఒక శేరు బియ్యం తీసుకెళ్ళింది. అప్పటికే వంటింట్లోకొచ్చి నిల్చుందిగని ఎంతకీ అడగలేకుండే నాకు తెలుసు కాబట్టి నేనే అడిగి ఇచ్చాను. నెమ్మదిగా అడిగితే ఇంత మాత్రం చెప్పింది. మరీ అభిమానం గల పిల్ల.'

అతను బాధపడ్డట్టు చూచాడు. ఇంతకూ లక్ష్మి అనేపిల్ల ఇంటి ప్రక్కన వారి అమ్మాయి. ఆ ఉదయమనగావెళ్ళి నాయన ఆ పిల్లతండ్రి. ఏదో నాలుగు ఇళ్ళకు తిరిగి ప్రైవేట్లు చెప్తూకూ ఇంతకాలం వెళ్ళబుచ్చాడు. కొద్ది రోజులుగా కాలం అట్లా వెళ్ళ మారటం లేదు. ప్రైవేట్లు తగ్గటంవల్ల కాబోలు,

నలుగురు ఉన్నకుటుంబం ఆ కొద్దిపాటి సంపాదనతో గడవాలి.

రాజారావ్ రెండు మజ్జిగ ముద్దలు నమిలాడు. ఆలోచనలతో మనస్సు పరిపరి విధాలుగా పోతోంది.

గొంతు తగ్గించి రహస్యంగా చెప్పింది రాధ. 'వాళ్ళ విన్నంతా పస్తే టండీ. ఆపాడుపిల్ల నిన్ననే చెప్పింది కూడా. అంతమాత్రం ఆదుకోలేమా?' మంచి నీళ్ళ గ్లాసునిండా పోసింది.

ఇక అతను ఒక్కముద్ద నోట్లో పెట్టుకోలా. కడుపులో ఏదో కెలికినట్లయింది.

'ఇంకా మజ్జిగ కొద్దిగా పోయనా?' అంటూ కంచంలో మజ్జిగ కుమ్మరించింది రాధ

'పాపం వాళ్ళ ఇదివరకు బాగా బ్రతికిన వాళ్ళేనట. చేస్తేచేస్తే నిక్షేపం లాంటి ఉద్యోగం ఊడిపోయిందిట. పాపం వాళ్ళకీ కష్టాలు దాపురించాయి. ఆయన టండీ...అయ్యయ్యో అదేమిటండీ...'

గ్లాసుడు నీళ్ళతో తినే తినే కంచంలో చేతులు కడుక్కున్నాడు అతను.

'అన్నం తినేటప్పుడు ఇటువంటి దౌర్భాగ్యపు కబుర్లు చెప్పవద్దని ఎన్నిసార్లు చెప్పాలి నీకు బుద్ధుండాలి మనుష్యులకు' అంటూ చివ్వున లేచిపోయాడు.

విశ్చేష్టయ్యింది రాధ.

* * *

అయితే ఇంత కలవరమూ సారధివల్లే కలిగింది రాజారావ్‌కి: సారధిచేసిన తప్పు కూడా ఏమీలేదు

ఆనాటి సాయంకాలం అన్యమనస్కుడై బజారుకు వెళ్తున్న రాజారావ్‌ని పనివేళ పిలిచి పలకరించాడు సారధి. బాల్య స్నేహితుడుకదా అని, ఆ స్నేహం బాల్య దశలోనే వదలక తరవాతేళ్ళ వచ్చేదాకా తమని బంధించి ఉంచింది కదాయని. ఆమాటకొస్తే ఇప్పటికీ మనస్సులో గూడు కట్టుకున్నదేమీ ఆపాయ్యంగాపిలిచి క్షేమం అడగాడు.

రాజారావ్ ముఖంలో సంతోషరేఖ ఒక్కసారి తళుక్కున వెలిగింది. వెలుగుని కళ్ళలో కడిగిన ముత్యంలా ఉన్నాడు సారధి

చనువుగా భుజంమీద చేయివేసి ఎదురు ప్రశ్న వేశాడు: 'ఏరా సారధి కులాసా ఆ...అరెరె...ఎన్నాళ్ళకెన్నాళ్ళకి కలిశాం! ఇన్నాళ్ళిక్కడ ఉన్నావ్? ఏం చేస్తున్నావిక్కడ?'

'నీకు ఉద్యోగంవచ్చి నీవు వెళ్ళిన దగ్గరనుండి వంటరివాణ్ణయాను మరి. నువ్వు ఇప్పుడు పెద్దవాడివై పోయావు గదా!' చిన్నగా నవ్వాడు సారధి 'కొన్నాళ్ళ అటూ ఇటూ తిరిగాను. తరువాత పొట్టగడవటమే కష్టమైంది. సరే ఏమయితే నేమయిందని టౌనొచ్చి హోటల్లో సర్వర్‌గా చేరిపోయాను.'

'ఆహా!' అన్నాడు రాజారావ్. వెలుగుతున్న కొవ్వొత్తి ఆరిపోతే ఎట్లా ఉంటుందో అట్లాయింది అతని ముఖం.

జేబులోనుండి సిగరెట్లు రెండు తీశాడు సారధి ఒకటి రాజారావ్‌కి అందించబోయాడు.

'లేదులే' మానేశాను.'

సిగరెట్టు అంటించుకుంటూ నవ్వాడు సారధి.

'బాబ్బా! రాముడు బుద్ధిమంతుడు. ఇంతకీ నీ సంగతి చెప్పలేదే!'

'ఏముందిలే...నీకు తెల్సుగా! అదే కంపెనీలో మేనేజరుగా ఉంటున్నా ప్రస్తుతం. అంతకంటే చెప్పుకోతగిన విశేషాలేమీ లేవు. వస్తా! అంతలి బజారులో కొద్దిగా పనుంది మళ్ళీ కలద్దాం!'

రాజారావ్ తొందరతొందరగా మనుష్యులలో కలిసిపోయాడు.

* * *

సారధి కన్పించటం దానికితోడు రాధమీద కోపం రెండూ జోడై రాజారావ్‌ని ఆరాత్రి చాలాసేపు నిద్రపోనీలేదు ఎంతోసేపు అటూ ఇటూ పొర్లుతూ మేల్కొనే ఉన్నాడు. రెండో ఆట సినిమా వదలటం కూడా అతనికి తెలుసు. తర్వాత అతనికి తెలియకుండానే నిద్రపట్టింది.

* * *

మర్నాడు ప్రొద్దున ఆఫీసుకెళ్ళి ఫైళ్ళలో మునిగిన రాజారావ్ ఒక్కసారి తలెత్తి చూచాడు ఉలిక్కిపడి గుమాస్తా ఒకడు రొప్పుతూ రోజుతూ వచ్చి నుంచున్నాడు.

'ఏం!' అన్నట్లు తలూపాడు రాజారావ్

'సార్! కామేశం ఆత్మహత్య చేసుకున్నాట్ట సార్!' గుమాస్తా ఇక ఏడుస్తాడేమో అనిపించింది.

రాజారావ్ ఒక్కక్షణం రాయిలా ఉండిపోయాడు.

'ఎవరూ క్లర్కు కామేశ్వర్రావా? ఎందుకట?'

'ఏముందిసార్! అతని భార్య చాలా రోజులనుండి మెంటల్లీ సర్వర్టెడ్. పెద్దపిల్ల పెద్దదై గుండెలమీద కుంపటిలా కూర్చుంది సార్! ఆయన చిన్నకొడుక్కి పోలియో వచ్చింది. ఇంతమంది ఈయన సంపాదనమీదే ఆధారపడి ఉన్నారు సార్. తల్లికి మధ్యన ఏదో ఆపరేషన్‌చేసే...'

తక్కున ఆపేశాడు గుమాస్తా. అప్పటికే రెండు మూడుసార్లు వెళ్ళి పొమ్మని సౌజ్ఞ చేశాడు రాజారావు.

ఆఫీసులో నలుగురూ కలిసి కామేశ్వర్రావ్ మృతికి సంతాపం తెలిపారు కామేశ్వర్రావ్ ఫామిలీకి ఆర్థికంగా సహాయం అందేటట్లు చూట్టానికి రాజారావ్ ప్రయత్నిస్తానన్నాడు.

అన్నీ పూర్తిచేసుకుని ఇంటికి బయల్దేరిన రాజారావ్‌కి తన ఇంటి గుమ్మం ముందే నిల్చుని పట్టెడు మెతుకుల కోసం దీనంగా వేడుకుంటున్న బిచ్చగాడొకడు కన్పించాడు. విసురుగా ఇంట్లోకి వెళ్ళాడు.

'వాడెవడో బిచ్చగాడు గొంతు చించుకుని అరుస్తుంటే విన్పించడంలా! పడేస్తే కాస్త అన్నం పడేయరాదా! లేకపోతే పొమ్మనరాదా! నీ నోరేమయిపోయింది.'

రాధమీద విరుచుకుపడ్డాడు.

'అయ్యయ్యో! రాంగానే ఇదేం గొడవండీ!విన్నటినుండీ చూస్తున్నాను.ఏమైంది మీకు?' రాధముఖం ముడుచుకు పోయింది.

'ఒళ్ళు పొగరెక్కింది. కళ్ళు నెత్తిమీద కొచ్చాయి. ఇదీ అయింది సరేనా ?'

రాజారావ్ బూట్లువిప్పి మూలకు విసిరేసి గదిలోకి పోయాడు.

* * *

అసలు రాజారావ్‌కి సారధికి మధ్య మామూలు స్నేహంగాక అవినాభావ సంబంధమే ఉండేది అయితే అది ఇప్పటికీ నిల్చి ఉందని చెప్పలేం. స్కూల్‌ఫైనల్ ఇద్దరూ కలిసి చదివి పాసైనారు ఉన్న ఒక్క దిక్కూ రాజారావ్‌కి తల్లే. సారధి

**గమనిక**


ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ కింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. —సం॥

వాయిదాలచెల్లింపుపద్ధతిపైట్రాన్సిస్టర్

బిన్నీ మాస్టర్

3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్

[వెల రూ. 165/—]



నెలకు రు 10 వంతున చెల్లించి పొందండి. ఇండియాలో అన్ని ప్రాంతములకు పంప వచ్చును. నేడే వ్రాయండి.

JANTA SALES (J-24)
21/43, Shakthinagar, Delhi-7.

జ్ఞాపకముంచుకోనుడు

కృష్ణవేణి ఇంకు

ఇండియాలో వ్యాపారసరళిని, శాస్త్రీయ పద్ధతిని ప్రప్రథమమున తయారుకాబడిన ఇంకు




Selling Agents:
NATIONAL PRODUCTS SYNDICATE
292 T. H. Road, MADRAS-81

# చల్లని మంట

మేనమామ ఇంట్లో ఉండి చదువుకునేవాడు.

'మ్యాట్రిక్' చదువు ముగియగానే ఇటు రాజారావ్ తల్లి, అటూ సారధి మేనమామ కాడికిందకు పారేశారు. ఇక చదువులు చెప్పించటం తమవల్ల కాదని, ఉన్న చదువే తమ నుద్ధరిస్తుందనే ఆశతో కొంతకాలం గడిపారు మిత్రు లిద్దరూ. అయితే రోజులు సంవత్సరాలైనాయి, కాని స్నేహితుల్లో మటుకు చలనం లేక పోయింది. ఇంట్లో తిని ఊరికాలవ కట్టమీద షికార్లు కొట్టటం, తోడివారితో తగువులు పడటంతో సాగిన వారి దిన కృత్యం ముదిరి ఊళ్లో 'రాడీవెధవ' అనే బిరుదు వచ్చేవరకు సాగింది. రాజారావ్ తల్లి పనిపాటా చేసి ఎంతోకాలం పోషించలేక పోయింది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అతని స్థితి తన్నగానే బూర్లెబుట్టలో పడ్డట్టయింది. ఎవరు తన్నినా బూర్లెబుట్టమాత్రం చలమయ్యగారి తాలూకుది. సాంప్రదాయంగా అంతమంచి పేరు లేని కుటుంబంలోని చలమయ్యగారు రాజారావ్‌కి కాళ్ళు కడిగి కన్నెనిచ్చారు. తరువాత తన స్నేహితుని సహాయంతో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంకూడా వేయించాడు. నాల్గయిదేళ్లలోనే రాజారావ్ పెరిగి మేనేజరయ్యాడు.

అయితే ఇంతటి 'శుభం' అందరికీ జరుగదు. పైగా సారధికి 'అశుభమే' జరిగింది. రాజారావ్ వెళ్లిన కొంతకాలం తరువాత సారధినికూడా ఏదైనా పని చూసుకోమని మేనమామ పోరు పెట్టసాగాడు. ఆయన బయటకు గెంటక ముందే జాగర్తపడ్డాడు అతను. అక్కడక్కడ ప్రయత్నించి ఇక గత్యంతరంలేక బస్తీకెళ్లి ఒక హోటల్లో సర్వర్‌గా చేరాడు.

* * *

మొదటిసారిగా బజార్లో కనిపించిన తర్వాత రాజారావ్‌కి సారధి చాలాసార్లు కనపడ్డాడు. అయితే అన్నిసార్లు రాజారావ్‌కి ముఖాముఖీ తటస్థపడ్డాడని చెప్పలేం. ఎందుకంటే రాజారావే జాగ్రత్తపడేవాడు. చూచికూడా చూడనట్లుగా ఎటో చూస్తూ తప్పించుకునేవాడు. తప్పించుకోలేని ఒకటి రెండు సందర్భాలలో సైతం ఏడవలేక నవ్వినట్లు వెకిలినవ్వు నవ్వి మూడుముక్కలు మాట్లాడి ఏదో పనున్నట్లు వదిలించుకు పోయేవాడు. ఇది గమనించి సారధికూడా దూరం దూరంగానే ఉండసాగాడు. 'ఎంతైనా పెద్ద ఉద్యోగి. అతనితో సామ్యమా' అని సమాధానం చెప్పుకునేవాడు.

ఒకరోజు హఠాత్తుగా సారధి రాజారావ్‌ని ఆఫీసులో కల్సుకున్నాడు. ఆముందు రోజే రాజారావ్ ఇంటికెళ్లాడు. అయితే రాజారావ్ ఇంట్లో లేనందున ఆఫీసుకు రావటం తప్పనిసరి అయింది సారధికి. ఆర్థికస్థితి కల్పించిన అంతరంతో అసలే మొగమాటస్థుడయిన సారధి ఆఫీసు వాతావరణంలో మరింత బిగుసుకు పోయాడు. అయితే తన పరిస్థితి గుర్తుకు వచ్చి అతన్ని మరింత హడల గొట్టింది. సారధి పనిచేస్తున్న హోటలు రెండు మూడు రోజుల్లో మూత పడబోతోంది. తర్వాత అతను తన స్థితిని గురించి ఆలోచించలేక పోయాడు.

కనీసం ఆఫీసులో 'బాయ్'గా అయినా ఉద్యోగం చూడమని రాజారావ్‌ని అర్థించాడు. ఆ మాత్రం సహాయం రాజారావ్ చేయకపోడనే ఆశ అతనికుంది.

నిజంగా రాజారావ్‌కి అతనిపై జాలి కలిగింది. సారధికి సహాయంచేసే స్థోమత అతనికుంది. కష్టాన్ని చూడలేని మెతక మనసు అతనిది. కాని ఒక్కసారిగా అతనికి భయమయ్యింది. ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు. మర్నాడు ఇంటికివచ్చి కల్సుకోమని సారధిని పంపివేశాడు.

* * *

టేబిల్ సొరుగులాగి నోట్లకట్ట తీశాడు రాజారావ్. ఆయిదొందలు లెక్కపెట్టి దిగాలుపడి నుంచున్న సారధి ముందుకు తోస్తూ అన్నాడు. 'ఇది ఉంచు. అవసరానికి ఉంటుంది. ఇప్పటికి నీకు ఉద్యోగం చూపించలేక పోయాననే బాధ నాకుంది. కాని వీలైనప్పుడు నేనే పిలుస్తాను. తెలిసిన వేరే కంపెనీలో ఏదో ఖాళీ ఉన్నదని విన్నా. దానికి ప్రయత్నిద్దాం.'

ఆత్మవిస్మృతునిలా నిల్చుండి పోయాడు

సారధి. కాసేపు అతనిచూపు వింతగా కన్పించింది రాజారావ్‌కి. అశక్తతతో, దుర్నీతిపంక బలహీనుడు చూసే చూపది.

డబ్బు వద్దన్నాడు సారధి. తన దుర దృష్టాన్ని నిందించుకున్నాడు. కడుపులో సుడులు తిరుగుతున్న బాధను అణచు కున్నా ముఖంమీద నిరాశని దాచలేక పోయాడు.


సారధి వెళ్ళిపోయినా చాలాసేపు రాజా రావ్ అక్కడే కూర్చుండి పోయాడు. ఏదో తెలియని ఆవేదనతో మధన పడిపోయాడు. లోని మానవత్వాన్ని చంపిన తన పిరికి తనం తనని ఇంకా కృంగతీస్తుందని పించింది. చచ్చిపోతున్న మానవత్వం తన బలహీనతను కనిపెట్టి హేళనగా నవ్వి నట్లయింది. అతని వ్యక్తిత్వం కుంచిం చుకు పోసాగింది. చూపు నిశ్చలతని నింపుకుంది. సారధిని వెనక్కి పిలుద్దామను కున్నాడు. మాట పెగలలేదు. అతను కుర్చీలోంచి లేవలేదు.

* * *

ఇంత జరిగిన తర్వాతనైనా రాజా రావ్‌లో పూర్తి మార్పు కలిగి మామూలు మనిషి అయ్యాడని చెప్పలేం. ఇప్పటికీ బిచ్చగాడికేక భయం కలిగించి అతన్ని బాధిస్తూనే ఉంది. రాధ ఇంటిప్రక్కవారి ప్రసక్తి తెచ్చినప్పుడల్లా అతను పూర్వంలా కోపగించుకోక పోవచ్చు. కాని లోపల అశాంతి పొందుతునే ఉన్నాడు.

చిక్కని చీకటిలా, పిశాచంలా ఆవ హించిన పేదరికంతో నిస్సహాయంగా పోరాటం సల్పుతున్న సాటి మానవునికి ఏ కొద్దిపాటి తోడ్పాటు ఇవ్వక విశ్చ లంగా చూస్తూ నిలబడగల నాగరీకు డతను. అతన్ని కట్టిపడవేసిన జడత్వం అంతటిది. పేదరికానికి, అతడు చాల దూరం.

పేదరికమంటే భయం అతనికి. విప రీతమైన భయం, వణుకు, తిండికి లేని వారంటే జాలి ఉంది. కానీ బీదరికం దృశ్యంలా కన్పించి గుండెదడ కల్పించ గల దశనిలో. ఆ బలహీనతని జయిద్దా మని అనుకుంటూనే ఉన్నాడు. ప్రయత్ని స్తూనే ఉన్నాడు. కానీ అంత తొందరలో అదే రాజారావ్‌ని వదిలేటట్టు లేదుమరి ●




రాల్ఫ్ జేమ్స్ పిహెచ్.డి.

# చిన్న పిల్లలతో మాట్లాడటం

సంభాషణ పెంచి చూడండి.

పెద్దవారు పరబాషణ ఎలాగ నేర్చు కుంటారో పిల్లలూ తమ మాతృభాషని అలాగే నేర్చుకుంటారని అనుకునేవారు, శాస్త్రజ్ఞులు కూడా| అంటే, వ్యాకరణం నియమాలని నేర్చుకుని క్రమంగా వాటికి అలవాటు పడిపోతారని అనుకుంటూ ఉండే వారు.

ఈ మధ్య జరిగిన పరిశోధన దీనిని కాదంటోంది. పిల్లలు తమ నియమాలని తామే సృష్టించుకుని క్రమంగా మాట్లాడి, మాట్లాడి అవసరం వచ్చినట్లు, ఆ నియ మాలని మార్చుకుంటారని పరిశోధకులు అంటున్నారు.

ఒకే ఒక భాషని శైశవంలో ఉన్నవారూ మాట్లాడవచ్చు, పెద్దవారూ మాట్లాడ వచ్చు, అయితే, ఈ 'భాష' ల వ్యాకరణా లలో తేడాలు ఉంటాయి. ఇది పరిశోధనల వల్ల తెలిసిన విషయం.

బాగా చిన్న వయసులో పిల్లలు రెండేసి మాటలు మాత్రం ఉండే వాక్యాలు వాడుతూ ఉంటారు. ఈ వాక్యాలలో వ్యాకరణం లోపిం చినా అర్థం సుస్పష్టంగా ఉంటూ ఉంటుంది.

## వెయ్యి మాటలు

ఇంగ్లీషు మాట్లాడే చోట్ల జరిగిన ఈ పరిశోధనలవల్ల తెలిసినది ఇంకా ఏమిటంటే, రెండేళ్ల శిశువుకి సాధారణంగా పాతికమాటల దాకా వస్తాయి, నాలుగు సంవత్సరాలకి అదే బిడ్డకి వెయ్యిమాటల పయిగా వస్తాయి !

ఈ వయస్సులోనే పెద్దవారి వ్యాకరణం పద్ధతులు వంట పట్టటం మొదలు పెడ్తాయి.

మరి, చిన్న పిల్లలకి భాష బాగా రావా లంటే పెద్దవారు చెయ్యవలసింది ఏమిటి?

వాళ్లతో ఎక్కువ మాట్లాడటం, అంటారు. బాగానే ఉంది కాని ఎలాగ మాట్లా డాలి?

## రెండు పద్ధతులు

హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మనశ్శాస్త్ర జ్ఞులు తమ పరిశోధనలనిబట్టి కొన్ని వింత విషయాలు తెలిశాయి.

రెండు జట్లు పిల్లలమీద కొన్ని ప్రయో గాలు చేశారు.

ఒక జట్టు పిల్లలు ఏదయినా అంటే వారి అసంపూర్ణ వాక్యాలని పూర్తి చేసేవారు.

ఉదాహరణకి ఒక శిశువు, 'పాప ఆకలి' అంటే— 'ఆ పాపకి ఆకలిగా ఉంది' అనే వారు.

రెండవ జట్టు శిశువు అదే 'వాక్యం' చెప్తే కేవలం పూర్తి వాక్యంతో ఆపక దాని మీద వ్యాఖ్యానం చేసేవారు. ఉదా హరణకి, 'అవును వాడికి [దానికి] తినాలని ఉంది.' అనేవారు.

## ప రీ క్ష లు

ఈ విధంగా ప్రయోగాలకి లోనయిన పిల్లలకి తర్వాత భాషా పరీక్షలు పెట్టగా రెండవరకం ప్రయోగానికి లోనయిన పిల్లలు బాగా సమాధానాలు ఇచ్చేవారుట.

దీనికి సరయిన, స్పష్టమయిన అర్థం చెప్పటం కష్టం. అయితే, ఎక్కువ రకాల వాక్యాలు విన్న శిశువుకి ఎక్కువ అర్థం అవు తుందని మాత్రం గ్రహించవచ్చు.

ఏది ఎలా ఉన్నా చిన్న పిల్లలతో సంభా షణలు పెంచినకొద్దీ, వారి వ్యాకరణాన్ని దిద్దేబదులు వారితో మాట్లాడినకొద్దీ వారు ఎక్కువ నేర్చుకొన గలుగుతారని మనం అనుకుంటే తప్పులేదు. మీరు చిన్న పిల్ల లతో మాట్లాడి చూడండి!

( కాపీరయిటు )